# 17. మూర్ఖుడు

"నువ్వు నా దగ్గర ఉండిపోరాదూ- నెలకు రెండొందలు ఇస్తాను-" అన్నాడు. ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

ఆమె ఇష్ట పడనట్టుగా చూసింది.

"నా దగ్గరుంటేనా- పువ్వుల్లోపెట్టి పూజిస్తూ, నీ జీవితానికి ఏలోటూ లేకుండా చూడనూ?"

"ఎందుకులెండి... మా కాపరం ఇంత మాత్రంగా గడుస్తే చాలు."

"కాపరం?" అని నవ్వి, "భార్య అందాన్ని గ్రహించలేని భర్త దగ్గర ఏం సుఖపడుతావ్?" అన్నాడు.

"ఆయన గ్రహించలేదని మీకెల్లా తెలుసు?"

"ఆఁ... ఎందుకు తెలియదూ? భార్య అందాన్ని ఒక్క రాత్రి రెండొందల రూపాయలకు అమ్ముకోవటమే కదూ గ్రహింపు?"

"పాపం ఆయన్ను మాత్రం ఏం చెయ్యమంటారు? మంచి చదువే చదివారు. పుష్కరం కష్టంతో, రెండు మూడువేల రూపాయిల ఖర్చుతో కొనుక్కున్న విజ్ఞానంతో ఆయన్ను లోకంలో ఏ ఒక్కరూ, ఏ విధంగానూ ఉపయోగించుకోలేక పొయ్యారు. కనీసం పొట్టగడిచేందుకు చిన్న ఉద్యోగం కూడా దొరికిందికాదు. పగలల్లా ఎన్నిచోట్ల వెతికినా- సంపాదనే కన్పించదాయె... ఆ విజ్ఞానంలో ఎవరన్నా బోధించారా సంపాదనను?-"

"భార్యను పోషించుకోలేని వాడి దగ్గర నీకేం సుఖముంటుందీ? ఈ మేడలూ, యీ మెత్తని పరుపులూ, అడగకముందే హాజరయ్యే వస్తువులూ, పరిచారికలసేవా- నీకేం అర్థమౌతాయ్? సూర్యచంద్రులు తొంగిచూసే ఆ పూరిపాకలో నీ సువర్ణ శరీరం మట్టిలో దొర్లుతూంటే నేనైతే సహించగలనా? జీవితం నీ కెల్లా అర్థమౌతుందో మరి?"

"జీవితం? ఏం మేడల్లోనే వుందా సౌఖ్యం? ఉంటే మీరు నా లాటి అందగత్తెలకోసం రాత్రింబగళ్లు తలబద్దలు కొట్టుకోవటం ఎందుకు?- మీకు తెలుస్తుందా అసలా జీవితం? కరెన్సీనోట్లతో బరువెక్కిన జేబుల్తో, అనేకమంది సానుభూతినీ, సహాయాన్నీ కోరకముందే తెచ్చుకోగల మీకు- మానవుడి బతుకెలా అర్థమౌతుంది? రోజంతా పనిచేసినా కనీసం పొట్ట నింపుకోలేని నిర్భాగ్యుల గోడు విన్పిస్తుందా సిమెంటుతో అందంగా కట్టుకొన్న యీ గోడల్ని దాటి?! ఒక్కనాడు డబ్బేమీ లేకుండా, పట్టణంలో ఆకలి తీర్చుకొనేందుకు ప్రయత్నించండి- జీవితం తెలుస్తుంది-"

"అందుకనే... అంత కష్టపడకుండానే నా దగ్గర ఉండమనటం. ప్రాణసమానంగా ప్రేమిస్తూ..."

మాట మధ్యలోనే అందుకొని, "ప్రేమా? దేనికీ? ఆకలి తీర్చుకొనేందుకా? హృదయంలో దాచుకొని గాలి పీలుస్తూ బతికేందుకా?- నేను మీ భార్యనైతే మాత్రం ఏం లాభం? అన్ని అవకాశాల్నీ చేతుల్లో పెట్టుకున్న మీరు, అందమైన అమ్మాయినీ, ఆమెతోపాటు మరి కొంత ఆస్తినీ కూడా సంపాయించుకున్న మీరు- మీ భార్యతో తృప్తిపడక నాదాకా రావటం దేనికీ? మీ కృతజ్ఞత ఏమైంది? ఇక నేనే మీ భార్యనైతే- ఆకలి సమస్య పోయి, దాని స్థానే మీ కున్నలాటి కొత్త సమస్య తయారయ్యేది... ఇప్పుడు కనీసం నాకు సానుభూతి చూపే ప్రాణి, జీవిత మార్గాన తోడు నీడగా ఉండే ప్రాణి ఒక్కటి వుంది- అది నాకు చాలదూ?"

పిల్ల జమీందారు ఆలోచిస్తున్నాడు- ఆమెను నమ్మించి తనదాన్నిగా చేసుకొనే ఇతర మార్గాల్ని. భర్త మీద ఆమెకు ఎలాగైనా ద్వేషభావం కల్పించి, ఆశను చూపుతూ ఊరించి, తన ఉంపుడుకత్తెల సంఖ్యకు మరొకటి కలుపుకునే సమస్య ఒక్కటే అతనిలో పనిచెయ్యసాగింది.

"అదికాదు... నేనైతే వెధవడబ్బుకోసం-"

"అవునవును... డబ్బు వెధవదేకదూ? అది మీదగ్గర అనుభవించలేనంత వుంది కనక, మీ దృష్టిలో దానికి విలువేముంటుందీ! కష్టపడి సంపాయించటం కాదుగా- సౌఖ్యాన్ని వెతికి, ఎక్కడ ఎంత వెలకు దొరుకుతుందో చూసుకొని కొనుక్కోవటమూ, ధనవ్యయకళాభ్యాసమేగా మీ నిత్యకృత్యం? డబ్బనే దాన్ని కల్పించి లోకంలో

ఎటుపోయినా కనీసం బతికేందుకు దాంతోనే అవసరాన్ని ఏర్పర్చి, అది లేందే క్షణంకూడా బతికేందుకు వీల్లేకుండా చేశారు!"

"నీకు హృదయం లేదూ? వెలకు అమ్ముడు బోతూంటే ఎలా ఊరుకున్నావు? తన స్వార్థానికి గాను ఉపయోగపడే భార్యాత్వంతోనే నీకు తృప్తన్నమాట?" అన్నాడు, ఆమె మనసును విరిచే మాటల్ని ఊహిస్తూ.

"ఆయన మీద తప్పు వేస్తారెందుకూ? ఆయనంటే నాకెంత గౌరవమో మీకేం తెలుసు? నా కోసం, సంసారం కోసం ఆయన ఎంత కష్టపడుతున్నాడో నాకు తెలుసు కనుకనే ఇందుకు ఒప్పుకున్నాను- నా స్వార్థం కోసం నేను ఆయన్ను ఉపయోగించుకోవటంలా? ఆయన ఎవరికీ పనికిరాలేదు; కాని నేను మాత్రం మీలాటి ఐశ్వర్యవంతులకు పనికొచ్చాను- అంతే భేదం! ఎంతో నచ్చచెప్పి యీ మొట్టమొదటిసారి యీ సంపాదనలో కష్టపడేందుకు ఆయన్ను ఎలాగో ఒప్పించి-"

"ఇది కష్టపడటమా?" అన్నాడు, కొత్తరకం మాటను విన్నవాడిలాగు.

"కాక మరేమనుకున్నారు? మిమ్మల్ని కోరివచ్చి మీ ఒళ్లో పడ్డాననుకున్నారా?"

నవ్వాడు, పిచ్చి వ్యక్తికి సానుభూతి చూపుతూన్నట్టు.

"అవును- ఆ విషయాన్ని మీరెల్లా ఒప్పుకుంటారు? మీలాగే నేనుకూడా సౌఖ్యాన్ని అనుభవించానని భ్రమిస్తున్నారు. కాని, నేను నిజం చెప్తున్నాను- మీరెల్లా తిప్పితే అల్లా తిరిగే కీలుబొమ్మగా మారాను. జీవంతోవున్న అందగత్తె మీనాక్షి మీకు చిక్కలేదు. ఆమె మనసూ, వాంఛలూ, హృదయమూ ఆత్మ మినహాగా మిగతా తోలు శరీరమొక్కటే మీకు దొరికింది... ఈ విషయాన్ని ఒప్పుకుంటే-"

"ఐతే శరీరాన్ని అమ్ముకున్నావన్నమాట-"

"అంతే! శరీరాన్నే. కష్టానమ్ముకోకుండా జీవించే మానవ ప్రాణిని చూపండి. నా కష్టాన్ని మీరు కొన్నారు- ఎక్కువ డబ్బుంది కనక: నేను కావాలనే వాంఛ గత ఎనిమిది నెల్లనుంచీ గాఢంగా మిమ్ము బాధిస్తోంది కనక ఎక్కువ వెల ఇచ్చారు-"

"నేనంటే నీకు ఇష్టంలేదూ?" అన్నాడు అనుమానం తీరక.

"ఊహుఁ... ఇష్టముంటే- యీ డబ్బు అవసరం కలగనినాడు, మీరు నాకోసం తిరుగులాడిన ఎనిమిది నెలలలోనూ ఎప్పుడో ఒకరాత్రి నా అంతట నేనేవచ్చేదాన్నిగా? బజారు వస్తువుల్ని కొన్నట్టే నా 'అయిష్టత'ను కూడా కొని, నేను యిష్టపడ్డట్టుగానే భావించి నా బాధతో ఆనందించారు."

"మోసం చేశావన్నమాట?"

"మీకు తెలియదూ ఇదంతా నటననీ, మోసమనీ? తెలియనట్టుగానే నటిస్తే కాని ఆ ఆనందం వుండదు!"

అతనికి పెద్ద దిగులుపట్టుకుంది. ఆమె చెప్పినవే నిజమైతే- ఆమె అయినా, ఆమెలాటి రబ్బరుబొమ్మయినా ఒకటే! కాని యీ మాటను తను నమ్మకుండా వుండేందుకుగాను పడుతూన్న అవస్థను మాత్రం అతను గుర్తించలేక పోతున్నాడు. నాటకంలో కిరాయికి వచ్చిన నటిలాగు ఆమె ప్రవర్తించిన దన్నమాట?... కాని, ఏమైతేనేం, ఆమెను తనతో కొన్నాళ్లపాటు కలిపి తిప్పుకుంటేకాని ఆమె తన గొప్పను గ్రహించలేదు. అందుకు ముందు రాహువులాగు అడ్డుపడే ఆ భర్త మీద ఏవగింపు పుట్టించటం అతనికి అత్యవసరంగా తోచింది.

"ఎల్లాగయినా ఆ మూఢుణ్ని చూసే మురిసి పోతూంటావ్. ఈ రాత్రిలాగే ఇంకా కొన్నిరాత్రులు ఇల్లాగే ఆహుతవుతే- ఆలోచించుకో..."

"అందుకని ఇప్పటినుంచే మీకు ఆహుతవమంటారు? మీ దయవల్ల యీ రెండొందలూ డిపాజిట్ కడితే దొర ఆయనకు ఉద్యోగం ఇస్తానన్నాడు-"

"ఆ దొర దగ్గరికే వెళ్ల లేకపొయ్యావ్?" అన్నాడు కోపంతో.

"అతనేమంత మూఢుడు కాదు. బాధను కాస్తోకూస్తో గుర్తించగలడు కనకనే- ఉద్యోగం ఇస్తానన్నాడు... పాపం ఆయన ఎక్కణ్నుంచి తెస్తాడు డబ్బును? ఆ బీదరికంలోని బాధ మీకెట్లా తెలుస్తుంది? ఆయనలో లోపం మాత్రం ఏముంది? బలహీనుడా? ముసలివాడా? అసమర్థుడా? తెలివితక్కువవాడా?-"

"మహా విజ్ఞానవంతుడులే- భార్యను ఉపయోగించుకోవటం చేతకాక-?"

"చేతకాక?" అని హేళన చేసి, "ఇది అవసరం కనక సరిపోయింది. నేనేమీభార్యనైతే, పెద్దఎరగా ఏ జామీనో చూపినట్టయితే- నన్ను బలవంతాన్నయినా ఇలాటి పనికి పంపేవాళ్ళేమో?- మీ మేడల జీవితానికీ, లోకంలో మాలాటి జీవితాలకూ చాలా భేదంవుంది.... ఒక్కరాత్రికే మీదృష్టిలో నా విలువ ఎంత తగ్గిందో చూడండి: మొదటి రాత్రి రెండొందలు ఇచ్చిన మీరు ఇకనుంచీ నెలకు రెండొందలు ఇస్తామని ఆశపెట్టారు. ఒక నెలగడవగానే మొత్తం జీవితానికి రెండొందలని అనేందుకు మాత్రం సందేహం ఏముందీ?"

తగ్గిన ఉద్రేకంతో ఆలోచనలో పడ్డాడు. ఎంత ధైర్యంగా అంది ... ఇదివరకు తను అనుభవించిన సుందరీమణులందరూ ఇలాగే బాధపడుతూ, కిక్కురుమనకుండా ఊరుకున్నారా? లేక తన ఐశ్వర్యాన్ని చూసి భయపడి, తమ పనిని పూర్తిచేసుకొని వెళ్లిపొయ్యారా?... అవును, కామజ్వరంతో వేడెక్కిన తన శరీరానికి అన్ని వాంఛలూ తీరిన జీవిలాగు, ఏ విధమైన ఆనందాన్నీ తన కళ్లలోంచి చూపకుండ ఆమె ఊరుకోవటాన్ని తను ఇంకోవిధంగా తీసుకోవటం మౌఢ్యమేనేమో?

"సరే ... ఇంకా గంటసేపేగా నేనిక్కడ ఉండేది - ఆలోచిస్తూ కాలం పాడుచేసుకుంటారేం?" అంది, ఆమె.

"నిన్నా... శవాన్ని తాకినట్టు... ఒద్దు-"

"ఉద్రేకంలో అవన్నీ ఎందుకు కన్పిస్తయ్?"

"ఇక చాలు- వెళ్ళు. నే అనుభవించింది ప్రాణహీన శరీరమనేమాట గుర్తొస్తుంటే బాధపడతాను. నీ అందం అక్కర్లేదు... వెళ్ళు-"

ఆమె మెల్లిగా వెళ్లిపోయింది. అతను కిటికీ దగ్గరికి వెళ్ళి బైటికి చూశాడు. ఆ వెన్నెల్లో ఆ భర్త, ఆమె భుజంమీద చెయ్యివేసి, నడిపించుకు వెళ్తూండటం కన్పించింది... ఆ భర్తో, తనో- ఇద్దర్లో ఎవరు మూర్ఖుడో అతనికి ఇప్పుడు బాగా అర్థమైంది.

*- ఫిబ్రవరి, 1942.*